క్లుప్తంగా

11న గీతా జయంతి ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: ఇస్కాన్ సాగర్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న గీతా జయంతి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు సాంబదాస్, డాక్టర్ నితాయి సేవిని తెలిపారు. శుక్రవారం ఓ హోటల్లో ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాలను పురస్కరించుకుని లక్ష గీతాదాన మహాయజ్ఞం, సంపూర్ణ గీతా పారాయణ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇస్కాన్ అంతర్జాతీయ చైర్మన్ గురు ప్రసాద్ స్వామి మహారాజ్, భక్తి వేదాంత బుక్ ట్రస్ట్ చైర్మన్ భీమా ప్రభుతో పాటు ముఖ్య అతిథిగా త్రిదండి చినజీయర్ స్వామి పాల్గొంటున్నట్టు తెలిపారు. పవిత్రమైన ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని శ్రీకృష్ణ భగవానుని కృపకు పాత్రులు కాగలరని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఎంపీ రాజశేఖర్, వంశీకృష్ణ ప్రభు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న వాసుపల్లి కుటుంబం



కుటుంబ సమేతంగా అమ్మవారికి పూజలు చేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మార్గశిర మాసోత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం అన్నారు. విశాఖను చల్లగా చూడాలని, జనంలోకి జగన్ కార్యక్రమం విజయవంతం కావాలని అమ్మవారిని ప్రార్థించారు. వాసుపల్లి సతీమణి ఉషారాణి, పెద్ద కుమారుడు సూర్య, సౌందర్య రాశి దంపతులు, చిన్న కుమారుడు సాకేత్ అమ్మవారిని దర్శించుకున్నారు.

చందక వీధి రెవెన్యూ సదస్సుకు 20 అర్జీలు



చందక వీధిలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట: మూడు సచివాలయాల పరిధిలోని చందక వీధిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సీఎం పర్యటన నగరంలో ఉండడం వల్ల స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ జిలానీ, జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యానాయుడు వచ్చి కొద్ది సేపు ఉండి వెళ్లిపోయారు. స్థానిక వీఆర్‌వో అప్పలనాయుడు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. మొత్తం 20 ఫిర్యాదులు అందాయి. వాటిలో ఒకటి పెన్షన్, ఏడు ఆదాయ సర్టిఫికెట్లు,12 కుల ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చాయి. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ

దాబాగార్డెన్స్: అయ్యప్ప భక్తులకు తెలుగుదేశం పార్టీ నాయకుడు బుచ్చా రామిరెడ్డి అయ్యప్ప స్వామి జీవిత చరిత్ర పుస్తకాలు అందజేశారు. పాతనగరంలో గల స్వామి వివేకానంద సంస్థలో మాలధారులకు నిర్వహిస్తున్న అల్పాహారం పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొని అయ్యప్ప భక్తులకు ఈ పుస్తకాలు అందజేశారు. అనంతరం గురుస్వాములు శ్రీను స్వామి, నాగేశ్వరరావు భవానీ, తాతాజీ భవానీని సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సూర్య నారాయణరెడ్డి, కోదండ, టి. కృష్ణ, సీహెచ్ పైడిరాజు, సత్తిబాబు, పోలవరపు అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

అపర సంజీవని



ప్రసాద్‌గార్డెన్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

హెపటైటిస్–బి, ఓపీవీ, బీసీజీ, డీపీటీ, ఎంఆర్ మీజిల్స్, రుబెల్లా వంటి వ్యాక్సిన్లు చంటి పిల్లలకు సంజీవని అని చెప్పాలి. వీటిని పిల్లలకు వైద్యులు సూచించిన ప్రకారం ఇవ్వాలి. అలాగే గర్భిణులు, బాలింతలు కూడా నిర్దేశిత సమయంలో వ్యాక్సిన్లు, ఇంజక్షన్లు తీసుకోవాలి. అప్పుడే తల్లీపిల్లలు ఆరోగ్యంగా ఉంటారు. వ్యాక్సిన్లు, వాటి ఉపయోగాలు, జాగ్రత్తల గురించి ప్రసాద్ గార్డెన్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సందేశ్ తెలియజేసిన వివరాలు..



బాలింతకు ఇమ్యునైజేషన్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎంలు

- వ్యాక్సిన్లతో చిన్నారులకు నిండు నూరేళ్ల ఆయుష్షు
- గర్భిణులు, బాలింతలకు మేలు

జగదాంబ: వ్యాక్సిన్లు చిన్నారులకు సంజీవని అని చెప్పాలి. 0–5 సంవత్సరాలలోపు చిన్నారులకు బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వడం వల్ల వారు ఆరోగ్యంగా ఎదుగుతారు. వ్యాధినిరోధకశక్తి పెరిగి తరచూ సంభవించే అనారోగ్యాలకు గురి కాకుండా ఉంటారు. గర్భిణులు, బాలింతలు కూడా సమయానికి నిర్దేశించిన ఇంజక్షన్లు తీసుకోవాలి. దీనివల్ల పుట్టబోయే బిడ్డలు పోలియో ఇతర వ్యాధులు సోకకుండా ఉంటారు. అలాగే పిల్లలకు జన్మనిచ్చే తల్లులు ధనుర్వాతం రాకుండా ఉండగలరు.

వ్యాక్సిన్లతో ఉపయోగాలు..

పిల్లలు పుట్టగానే హెపటైటిస్–బి వ్యాక్సిన్ వేయాలి. దీని వల్ల పిల్లల లివర్ ఫంక్షన్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. అలాగే ఓపీవీ, బీసీజీ, డీపీటీ, ఎంఆర్ మీజిల్స్, రుబెల్లా వంటి వ్యాక్సిన్లు వేయాల్సి ఉంటుంది. ఈ వ్యాక్సిన్ల వల్ల పిల్లల్లో మెరుగైన లివర్ ఫంక్షన్, పచ్చకామెర్లు, పోలియో, టీబీ, డిఫ్తీరియా వంటి వ్యాధులు సోకకుండా ఉంటాయి.

నిర్దేశిత సమయంలో వ్యాక్సిన్ వేసుకోకపోతే..

నిర్దేశించిన సమయానికి తల్లీపిల్లలు కచ్చితంగా వ్యాక్సిన్లు వేసుకోవాలి. ఆలస్యం అయితే వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. ఇతర అనారోగ్యాలు కూడా కలిగే అవకాశం ఉంటుంది. అందుకే మహిళలు గర్భం దాల్చిన నాటి నుండి వైద్యుల పర్యవేక్షణలో ఉండి సూచించిన మందులు, వ్యాక్సిన్లు క్రమం తప్పకుండా తీసుకోవాలి. పిల్లలకు వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత వెంటనే పాలు ఇవ్వవచ్చు. లేదా అరగంట తర్వాత అయినా ఇవ్వవచ్చు.



పండా వీధిలో చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్‌ఎం

ఎప్పుడెప్పుడు ఇవ్వాలి?

బీసీజీ, ఓపీవీ, హెపటైటిస్–బి వ్యాక్సిన్లు పిల్లలు పుట్టగానే ఇవ్వాలి. తర్వాత 10, 14వ వారం ఇవ్వాలి. 9 నుంచి 12 నెలల లోపు, 16 నుంచి 24 నెలలలోపు ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం 5 నుంచి 6వ సంవత్సరంలో, మళ్లీ 10 సంవత్సరాలకు, 16వ సంవత్సరంలో ఇవ్వాల్సి ఉంటుంది. వీటితో పాటు కొన్ని వ్యాక్సిన్లు వయస్సును బట్టి మార్చి ఇస్తారు. ఇవన్నీ సమీప ఆస్పత్రిలో క్రమం తప్పకుండా తీసుకోవాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహిస్తే పోలియో, ధనుర్వాతం, దగ్గు, పచ్చకామెర్లు, లివర్ ఫంక్షన్ తగ్గడం, వ్యాధినిరోధక శక్తి తగ్గడం వంటి ఇబ్బందులను పిల్లలు ఎదుర్కొంటారు

తల్లీపిల్లల ఆరోగ్యం కోసం..

మహిళలు గర్భంతో ఉన్నప్పుడే ప్రతినెల ఆస్పత్రిలో చెక్ చేయించుకోవాలి. తగిన మందులతో పాటు తల్లి కూడా వ్యాక్సిన్లు తీసుకోవాలి. పుట్టిన తర్వాత పిల్లలకి డాక్టర్ సలహా ప్రకారం వ్యాక్సిన్లు వేయించాలి. ఈ విధంగా జాగ్రత్తలు పాటిస్తే తల్లీపిల్లలు ఆరోగ్యంగా ఉంటారు. అలాగే ప్రసవం తర్వాత బాలింతలు పుట్టిన పిల్లలకు ఆరు మాసాల పాటు తల్లిపాలు పట్టాలి. వ్యాక్సిన్లు వేయడం ఎంత ముఖ్యమో పిల్లలకు తల్లిపాలు పట్టడం కూడా అంతే ముఖ్యం.

ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో..



గర్భస్థ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రసాద్‌గార్డెన్స్ ఆస్పత్రిలో వైద్యులు తెలిపారు. అలాగే వేసుకోవాల్సిన వ్యాక్సిన్ల గురించి వివరించారు. వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్య సిబ్బంది చెప్పినట్లు జాగ్రత్తలు తీసుకుంటున్నాను.

– భవానీ, గర్భిణి, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35వ వార్డు

అన్ని వ్యాక్సిన్లు వేశారు..



ఆస్పత్రిలోనే ప్రసవం జరగడం వల్ల బిడ్డ పుట్టాక బరువు చూసి వెంటనే అవసరమైన వ్యాక్సిన్లు వేశారు. ప్రతి నెల పరీక్షలు చేయించుకుంటున్నాను. ఏఎన్‌ఎం వచ్చి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుంటున్నారు.

– దుర్గాభవానీ, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35వ వార్డు.

అశ్రద్ధ తగదు..



తల్లీపిల్లలకు వ్యాక్సిన్లు తప్పనిసరి. ఈ విషయంలో అశ్రద్ధ కూడదు. అలాగే పుట్టిన పిల్లలకు తల్లి తప్పకుండా తల్లిపాలు పట్టాలి. దీని వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. చిన్న చిన్న అనారోగ్యాలు రాకుండా అడ్డుకట్ట వేస్తుంది.

– డాక్టర్ సందేశ్, ప్రసాద్‌గార్డెన్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, జీవీఎంసీ 35వ వార్డు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

దాబాగార్డెన్స్: గత 20 ఏళ్లుగా వస్తున్న స్టోరేజ్ ఓటీ సిస్టమ్‌ను ఏకపక్షంగా రద్దు చేసి ఆరుగురిపై పోలీస్ కేసు, 36 మందిని సస్పెండ్ చేసిన ఎన్‌ఏడీ యాజమాన్యం చర్యలను అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా ఖండించాయి. స్టోరేజ్ ఓటీ ఇవ్వడంతో పాటు పోలీస్ కేసు, సస్పెన్షన్ ఎత్తివేయాలని, మహిళా ఉద్యోగులతో అసభ్యంగా మాట్లాడిన చీఫ్ జనరల్ మేనేజర్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో నాయకులు భేటీ అయ్యారు. గత 20 ఏళ్లుగా అమలవుతున్న పద్ధతులను ఏకపక్షంగా మార్చేసి, ఎన్‌ఏడీలో కష్టపడి పని చేసిన 600 మంది కార్మికులకు స్టోరేజ్ ఓటీ ఇవ్వలేదని, అది చట్ట విరుద్ధమని ప్రస్తుత చీఫ్ జనరల్ మేనేజర్ చెబుతున్నారన్నారు. ఇదే చీఫ్ జనరల్ మేనేజర్ అనేక మందితో శని, ఆదివారాలతో పాటు పని దినాల్లో 12 గంటలు పైబడి డ్యూటీ చేయిస్తున్నారన్నారు. దీనిపై చర్చించేందుకు సీజీఎం ఆహ్వానంపై జనరల్ మేనేజర్, లేబర్ ఆఫీసర్, ఇతర అధికారుల సమక్షంలో చర్చలకు వెళ్లిన నాయకులు, 36 మంది కార్మికులను సస్పెండ్ చేశారన్నారు. ఆరుగురిపై పోలీస్ కేసు పెట్టారని, సమస్యలు అడిగినందుకు విశాఖ ఎన్‌ఏడీ సీఈయూ ప్రధాన కార్యదర్శికి 6 చార్జ్‌షీట్లు ఇచ్చారన్నారు. ఇవన్నీ ఉపసంహరించుకోవాలని తీర్మానించారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు బి. నాగభూషణం, సిటు నాయకుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ నుంచి రెడ్డి వెంకట్రావు, సీఎఫ్‌టీయూ నుంచి కె. లక్ష్మి, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు కె.ఎం. శ్రీనివాస్, జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు పి. వెంకట్‌రెడ్డి, బీహెచ్‌పీవీ ఎంప్లాయీస్ యూనియన్ నుంచి ఆర్ జనార్దన్, పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ నుంచి ఎస్. జ్యోతీశ్వరరావు, సీహెచ్ నాగచైతన్య, కేఎం కుమార్ మంగళం, ఎం. మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ

అల్లిపురం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జిల్లా మలేరియా అధికారి తులసిరాజు అన్నారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా శుక్రవారం ఆమె అల్లిపురం సచివాలయం పరిధిలో అమ్మవారివీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు మలేరియా సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానికులకు వివరించారు. అల్లిపురం, భానోజీ నగర్ సచివాలయాలకు చెందిన సిబ్బంది, సబ్ యూనిట్ ఆఫీసర్ శేషుబాబు, ఆరోగ్య కార్యకర్త మురళి, ఏఎన్‌ఎం తులసి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరువీధి ఉత్సవం



శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం



తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న శ్రీ లక్ష్మీనరసింహ కోలాటం బృందం

అల్లిపురం: అస్సాం గార్డెన్స్‌లోని శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ అనంతరం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించారు. సాయంత్రం ఉత్సవ మూర్తుల తిరువీధి అత్యంత వైభవంగా చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి, అర్చకుడు బులుసు సాయికృష్ణ శర్మ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఎల్. సుకుమార్, ఎ. లక్ష్మణరావు, ఆలయ సిబ్బంది గోపి, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సోదరుని చెంతకు ఒడిశా యువతి



పల్లవిని సోదరునికి అప్పగిస్తున్న ఏయూటీడీ సభ్యులు

సీతమ్మధార: వివాహం చేసుకోవడం ఇష్టం లేని ఒక యువతి ఒడిశా నుంచి విశాఖ వచ్చేయగా ఏయూటీడీ సభ్యులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. వివాహం ఇష్టం లేని పల్లవి (19) అనే యువతి ఒడిశాలోని బరంపురం నుండి రైలులో విశాఖ వచ్చేసింది. ఇది గమనించిన ఆమె సోదరుడు చరణ్ ఆన్ లైన్‌లో రైల్వే పోలీసులకు కంప్లైంట్ చేయడంతో వెంటనే విశాఖ రైల్వే పోలీసులు స్పందించి ఆ అమ్మాయిని వైజాగ్‌లో దింపేసి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అల్లిపురం భీంనగర్ షెల్టర్ మేనేజర్ భాస్కరరావు వెళ్లి ఆ అమ్మాయిని ద్వారకానగర్‌లో గల జీవీఎంసీ–ఏయూటీడీ నిరాశ్రయ మహిళా షెల్టర్ హోంకి తరలించారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి ఇచ్చిన సమాచారం మేరకు ఆమె సోదరుడు బరంపురం నుండి విశాఖ వచ్చారు. అతనికి పల్లవిని అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ సభ్యులు, కేర్‌టేకర్లు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో వచ్చే క్యాన్సర్లపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం, ఆదిలక్ష్మి

మహారాణిపేట: పిల్లల్లో వచ్చే జెనెటిక్ క్యాన్సర్ల ముందస్తు గుర్తింపుపై శుక్రవారం కేజీహెచ్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యుల నుంచి వివిధ రకాల క్యాన్సర్ల బారిన పడిన పిల్లలకు ఎన్ని పథకల్లో వైద్యం అందిస్తున్నారని సీతారాం అడిగారు. క్యాన్సర్ వ్యాధి నిర్ధారిత ప్రత్యేక లేబొరేటరీ ఆస్పత్రిలో ఉందా, 3,4 ఏళ్లలోపు పిల్లల్లో వచ్చే క్యాన్సర్లు ఎన్ని రకాలు అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వి.రవి, మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి, పిల్లల విభాగం వైద్యులు రత్నకుమారి, డాక్టర్ సందీప్ కమిషన్ సభ్యులకు పలు అంశాలు వివరించారు. కమిషన్ సూచించిన వివిధ అంశాల అమలుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.హెచ్.లక్ష్మి, వివిధ విభాగాల ప్రతినిధులు బి.మమత, ఆనంద్, శకుంతల, ఆస్పత్రి మేనేజర్ జవహర్, వన్ స్టాప్ సెంటర్ ప్రతినిధి శరణ్య, మాలతి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత.. స్ఫూర్తి ప్రదాత

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు పలువురి నివాళి



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ వెంకట హరి కుమారి, కమిషనర్ సంపత్‌కుమార్



అల్లిపురం మెయిన్‌రోడ్డులో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న పచ్చిరిపల్లి రాము తదితరులు



అంబేద్కర్‌కు నివాళి అర్పించిన బీజేపీ నేత రవికుమార్ తదితరులు



ఎల్‌ఐసీ భవనం వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్, బీజేపీ నాయకులు



అంబేద్కర్‌కు నివాళులు అర్పించిన పోర్టు చైర్మన్ అంగముత్తు తదితరులు

దాబాగార్డెన్స్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కొనియాడారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం అంబేద్కర్ 68వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కమిషనర్ సంపత్ కుమార్, అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి మేయర్ నివాళులర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ ఔన్నత్యాన్ని, ప్రజా స్వామ్య స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తన్నారు. కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ భారతీయ న్యాయవాది, అర్థశాస్త్రవేత్త, రాజకీయ నేత, గొప్ప సంఘ సంస్కర్త అని తెలిపారు. యూసీడీ పీడీ పీఎం సత్యవేణి, డీపీవో ఫణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, వలువురు అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనే రాజ్యాంగానికి విఘాతం..

మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగానికి బీజేపీ పాలన విఘాతంగా మారిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా ఎల్‌ఐసీ భవనం వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పార్టీ నేతలతో కలిసి జేవీ నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. మన్మథరావు, సీఎస్ క్షేత్రపాల్, జి. కాసులరెడ్డి, ఎస్. నాగభూషణం, ఆదినారాయణ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము తదితరులు అల్లిపురం మెయిన్‌రోడ్డు, బోర్డు స్కూల్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వార్డు కార్యకర్తలు పీవీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

32వ వార్డులో..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా భీమ్ నగర్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం పక్కనే గల భీమ్‌నగర్ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. కందుల కేథార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

29వ వార్డులో..

జీవీఎంసీ 29వ వార్డులో బీజేపీ సీనియర్ నాయకుడు ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి పార్టీ నగర ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, కొప్పాల రాము, చింతపల్లి ధనలక్ష్మితో కలిసి అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు. సీనియర్ బీజేపీ నాయకురాలు కూరాడ పావని, నాగరాజు, వెంకట్రావు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు మంత్రి సత్యకుమార్ నివాళి..

దాబాగార్డెన్స్: ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దాబాగార్డెన్స్‌లో గల బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్, కార్యవర్గ సభ్యులు బుద్ధా లక్ష్మీనారాయణ, డాక్టర్ సుహాసిని ఆనంద్, పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి, అరకు జిల్లా ఇన్‌చార్జి పరశురామరాజు, విశాఖ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం దానేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. విజయ్‌బాబు, రాకేష్ చంద్ర, కొప్పుల రామ్‌కుమార్, చొక్కాకుల రాంబాబు, మురళీమోహన్‌రాజు, తలాడి గిరిజ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి..

కంచరపాలెం: న్యూపోర్ట్ కూడలిలో శుక్రవారం పోర్టు ట్రస్ట్ ఎస్సీ, ఎస్టీ అధికారులు, ఉద్యోగ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ముందుగా పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, ప్రధాన విజిలెన్స్ అధికారులు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం ఏఎమ్స్‌యూఆర్‌ఎం కాలనీలో సీపీఐ, న్యూడెమోక్రసీ, భారత నాస్తిక సమాజం సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు వై.కొండయ్య, శ్రీరామమూర్తి, ఎం.వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, రవికుమార్, లక్ష్మి పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు బీజేపీ నేతల నివాళి..

మహారాణిపేట: ఏవీఎన్ కాలేజీ దగ్గర భారతీయ జనతా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళి అర్పించారు. శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు ఒ. ఆల్బర్ట్, నగర బీజేపీ ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, దశమంతుల శ్రీను, కొత్తపల్లి నాగేశ్వరరావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు

13న హనుమత్ వ్రతం



మహారాణిపేట: మెయిన్ రోడ్డులో వేంచేసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 13న హనుమత్ వ్రతం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ. 216 దేవస్థానంలో చెల్లించాలని, రుసుం చెల్లించిన వారికి లడ్డూ, పులిహోర, సిందూరం అందజేస్తామని ఈవో తెలిపారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తోనే క్యాన్సర్ నిర్మూలన



పిల్లలతో నిర్వాహకులు

జగదాంబ: హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తోనే మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను తరిమి కొట్టగలమని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ తెలిపారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ, ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా యూనిట్ సంయుక్తంగా కోటవీధి సమీపంలోని ఫిషర్‌మెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. చైతన్య స్రవంతి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ డాక్టర్ షిరీన్ రెహమాన్ మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేయాలని నిర్ణయించి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఈ శిబిరం ఏర్పాటు చేసిన డాక్టర్ షిరీన్ రెహమాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు నారాయణ్, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాస్, సీరం ఇనిస్టిట్యూట్ మేనేజర్ రాం రతన్, చైతన్య స్రవంతి ప్రతినిధులు రుకుయా భాను, ఉమ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.